రాజేంద్రనగర్ రాజకీయాల్లోకి కార్తీక్‌రెడ్డి

- బీఆర్‌ఎస్ పార్టీ ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు
- పార్టీ నాయకులతో స్పష్టం చేసిన కేటీఆర్


బీఆర్‌ఎస్ నాయకుడు కార్తీక్ రెడ్డి

మణికొండ: రాజేంద్రనగర్ రాజకీయాల్లోకి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి రంగ ప్రవేశం చేయనున్నారు. మాజీ మంత్రి పి.సబితారెడ్డి తనయుడిగా, గతంలో చేవెళ్ల పార్లమెంట్ నుంచి ఎంపీగా పోటీ చేసిన కార్తీక్‌రెడ్డికి రాజేంద్రనగర్ బీఆర్‌ఎస్ పార్టీ బాధ్యతలను అప్పగించే దిశగా అడుగులు వేస్తున్నట్టు పార్టీ నాయకులు చర్చించుకుంటున్నారు. బీఆర్‌ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్ రెండు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్యనాయకులు, ప్రజాప్రతినిధులు ఆయనతో పాటు వెళ్లిపోయారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీ కేడర్, అభిమానులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నియోజకవర్గంలో నష్ట నివారణ చర్యలు చేపట్టారు. అందులో భాగంగా రాజేంద్రనగర్ నియోజకవర్గ వ్యాప్తంగా గుర్తింపు, పరిచయాలు, కేడర్ ఉన్న కార్తీక్‌రెడ్డిని రంగంలోకి దించే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. గతంలో ఉమ్మడి చేవెళ్ల అసెంబ్లీ నియోజకవర్గంగా ఉన్న సమయంలో ఎమ్మెల్యే, మంత్రిగా పనిచేసిన సబితారెడ్డి, ఇంద్రారెడ్డి కుటుంబానికి అటు చేవెళ్ల, ఇటు రాజేంద్రనగర్ నియోజకవర్గాల్లో పెద్ద ఎత్తున అభిమానులు, కేడర్ ఉంది. సబితారెడ్డి మహేశ్వరం నియోజకవర్గానికి మారిన తర్వాత రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మంత్రిగా తప్ప మిగతా కార్యక్రమాల్లో ఎక్కువగా పాల్గొనలేదు. దాంతో కొంత కేడర్ ఇతరుల వైపు మళ్లినా తిరిగి వారు రంగంలోకి దిగితే వారి వెంట నడిచేందుకు బీఆర్‌ఎస్ పార్టీలో మిగిలిపోయిన కేడర్ సిద్ధంగా ఉంది. ఆదివారం మాజీ మంత్రి కేటీఆర్‌ను కలిసిన మణికొండ నాయకులతో త్వరలోనే పార్టీని సంస్థాగతంగా పూర్తి స్థాయిలో మార్పులు చేస్తామని, పార్టీ మారిన ఎమ్మెల్యే స్థానాల్లో వారిని ధీటుగా ఎదుర్కొనే నాయకులను రంగంలోకి దించుతామని స్పష్టం చేసినట్లు నాయకులు పేర్కొన్నారు. అందులో భాగంగానే ఎప్పటినుంచో రాజేంద్రనగర్ నియోజకవర్గంపై కన్ను వేసిన కార్తీక్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలనే దిశగా సంకేతాలు ఇచ్చినట్టు తెలిసింది.

రాజ్యసభ విజయవంతం


అమ్మవారిని దర్శించుకున్న ప్రశాసన్ కమిటీ సభ్యులు

అత్తాపూర్: రామరాజ్య ప్రశాసన్ అయోధ్య అఖిల్ భారతీయ ప్రశాసన్ రాచూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో జాతీయ రాజ్యసభ రెండవ రోజు మహేశ్వరం మండలంలోని నాగారంలో జరిగింది. రాజ్యసభ సమోరోప్ అనంతరం ప్రశాసన్ కమిటీ సభ్యులు చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం జాతీయ ప్రశాసక్ భాస్కర్ సింగ్ మాట్లాడుతూ... తెలంగాణలో రాజ్యసభ విజయవంతం అయ్యిందని, భాగ్యలక్ష్మీ అమ్మవారిని దర్శించుకోవడం పూర్వ జన్మ సుకృతమని అన్నారు. రాజ్యసభ వచ్చే ఏడాది రాజాస్థాన్‌లో నిర్వహించడానికి జాతీయ కమిటీ నిర్ణయించిందని తెలిపారు. కార్యక్రమంలో జాతీయ సంరక్షన్ శ్రీధర్, జాతీయ రాజ్ కోశాధికారి శ్రవణ్, అయోధ్య ప్రాబారీ రవి, తివారీ, ఢిల్లీ ప్రముఖ్ శ్రవణ్, తెలంగాణ ప్రముఖ్, కేవీ నర్సింగ్‌రావు, ఆంధ్రప్రదేశ్ ప్రముఖ్ పిల్ల వినోద్‌కుమార్, రాజాస్తాన్ ప్రముక్ మహావీర్, డాంగి ఉత్తరప్రదేశ్ ప్రముఖ్ వికాస్ జి. మధ్యప్రదేశ్ ప్రముఖ్ వీరేందర్, తెలంగాణ రాజ్ కోశాధికారి సుధాకర్, తెలంగాణ సంరక్షన్ మొంద్ర కొమరయ్య, దుర్గాప్రసాద్, అనునాయ్ తదితరులు పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు


మాట్లాడుతున్న ఆలయ కమిటీ సభ్యులు

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలోని హైదర్‌గూడ పోచమ్మ దేవాలయంలో బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 28న జరిగే ఉత్సవాల్లో వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనున్నట్లు ఆలయ కమిటీ ప్రకటించింది. ఈ మేరకు ఉత్సవాల ఏర్పాట్లపై ఆదివారం ఉదయం ఆలయ కమిటీ సమావేశమయ్యారు. బోనాల ఉత్సవాలు ఉదయం 6 గంటలకు అభిషేకంతో మొదలై రాత్రి ఘటాల ఊరేగింపుతో ముగుస్తుందని కమిటీ వెల్లడించింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ఎట్టకేలకు పాతబస్తీకి చేరుకున్న 'రూపవతి'



చార్మినార్: మొహర్రం సంతాప దినాలతో పాటు బోనాల జాతర ఉత్సవాల సామూహిక ఊరేగింపులో వినియోగించే ఏనుగు (రూపవతి) ఎట్టకేలకు పాతబస్తీకి చేరుకుంది. కర్ణాటకకు చెందిన రూపవతి అనే ఏనుగు రావడంతో ప్రస్తుతం కూడా కార్యాలయ ప్రాంగణంలో ఉంచారు. మొహర్రం సంతాప దినాల సందర్భంగా నిర్వహించే పదో మొహర్రం సామూహిక ఊరేగింపునకు ఏనుగును వినియోగించడం ఆనవాయితీగా వస్తోంది. మొహర్రం ఊరేగింపు అనంతరం నిర్వహించే బోనాల జాతర సామూహిక ఊరేగింపులో కూడా వినియోగిస్తారు. ఈనెల 17వ తేదీన పాతబస్తీ వీధుల్లో నిర్వహించే మొహర్రం సామూహిక ఊరేగింపు కోసం ఇప్పటికే నగరానికి చేరుకుని రిహార్సల్ సైతం నిర్వహించాల్సి ఉండేది. అయితే కర్ణాటక నుంచి తీసుకురావడానికి అన్ని ఏర్పాట్లు చేసినప్పటికీ రూపవతి అనారోగ్యంగా ఉందని, దీనిని సామూహిక ఊరేగింపులో వినియోగించరాదని ఫిర్యాదులు అందడంతో కర్ణాటక డిఎఫ్‌ఓ అభ్యంతరం తెలిపారు. సంబంధిత పశువైద్యుల వైద్య పరీక్షల అనంతరం రూపవతి ఆరోగ్యంగా ఉందని సర్టిఫికెట్ జారీ చేయడంతో కర్ణాటక నుంచి రూపవతి నగరానికి చేరుకుంది. సంబంధిత పశువైద్యుల వైద్య పరీక్షల అనంతరం రూపవతి ఆరోగ్యంగా ఉందని కోరుకుంటూ సర్టిఫికెట్ జారీ చేయడంతో కర్ణాటక నుంచి రూపవతి నగరానికి చేరుకుంది. అయితే మొహరం సంతాప దినాలు ప్రారంభమై ఐదో మొహరం నాడు పాతబస్తీ ప్రధాన వీధుల్లో రిహార్సల్స్ నిర్వహించాల్సి ఉంది. ఏనుగు రావడం ఆలస్యం కావడంతో సోమవారం మధ్యాహ్నం ఒంటిగంటకు రిహార్ల నిర్వహించన్నారు. దక్షిణ మండలం డీసీపీ స్నేహా మెహ్రా, అదనపు డీసీపీ షేక్ జహంగీర్, మీర్‌చౌక్ ఏసీపీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఇప్పటికే మొహర్రం ఊరేగింపు రూట్లను నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాసరెడ్డితో పాటు విద్యుత్ అధికారుల బృందం పరిశీలించింది.

మోదీతో పాటు మంత్రులకు ధన్యవాదాలు

మొహర్రం సంతాప దినాల్లో భాగంగా నిర్వహించే పదో మొహర్రం సామూహిక ఊరేగింపునకు ఏనుగును తెప్పించడంలో కీలక పాత్ర పోషించిన దేశ ప్రధాని నరేంద్ర మోడీతో పాటు మంత్రులు జి.కిషన్ రెడ్డి తదితరులకు ధన్యవాదాలు తెలియజేస్తున్నామని బిజెపి రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ తెలిపారు.

'దర్బార్ మైసమ్మ బోనాలు ఘనంగా నిర్వహిస్తాం'

గోల్కొండ: కార్వాన్ దర్బార్ మైసమ్మ బోనాలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ ఠాకూర్ అమర్‌సింగ్ అన్నారు. ఆదివారం ఆలయ ప్రాంగణంలో ఈ ఏడాది బోనాల నిర్వహణపై ట్రస్ట్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరానికి తలమానికంగా ఉండే విధంగా బోనాల నిర్వహణకు ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తామన్నారు. బోనాల నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక పోలీసులతో పాటు ట్రాఫిక్ పోలీసులను కూడా బోనాల నిర్వహణకు సహకరించాల్సిందిగా కోరుతామన్నారు. కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి బోనాలకు ప్రత్యేకంగా రానున్నారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యుడు, బీజేపీ గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు జి.సునీల్‌యాదవ్ తదితరులున్నారు.


ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుల సమావేశం

శంషాబాద్‌లో నీటి గోస!

- ప్రతిరోజు ఐదు మిలియన్ లీటర్ల నీరు అవసరం
- సరఫరా అయ్యేది 3 మిలియన్లు మాత్రమే
- అక్రమ నల్లా కనెక్షన్లతో అసలైన వారికి కష్టాలు


హుడా కాలనీలో నిర్మాణం పూర్తయిన 2 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఓవర్‌హెడ్ ట్యాంకు

శంషాబాద్: శంషాబాద్ పట్టణంలో నీటి కష్టాలు ప్రజలను గోస పెడుతున్నాయి. చాలీచాలనీ నీటి సరఫరాతో పట్టణ ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. నీటి సమస్యను అధిగమించేందుకు ప్రజాప్రతినిధులు.. అధికారులు సరైన చొరవచూపకపోవడంతో సమస్య తీవ్ర రూపం దాల్చుతోంది. పట్టణంలో ఉన్న అక్రమ నల్లా కనెక్షన్లు కూడా ఇందుకు ఓ కారణంగా మారుతున్నాయని హెచ్‌ఎండబ్ల్యూఎస్ గణాంకాలు చెబుతున్నాయి.

నీటి సరఫరాపై సమీక్షలు లేవు..

గత కొంత కాలంగా నీటి సమస్య తీవ్ర రూపు దాల్చినా అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సమస్య పరిష్కారానికి ఎలాంటి సమీక్షలు సైతం నిర్వహించకపోవడంతో ఆయా వార్డుల ప్రజాప్రతినిధులు ప్రజల నుంచి తీవ్ర ఆగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. నీటి సరఫరా మెరుగుపర్చేందుకు ప్రత్యేక శ్రద్ధ కనబర్చడంలేదనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నా అందులోనూ వివక్షత కొనసాగుతుందనే ఆరోపణలున్నాయి.

ఓవర్ హెడ్ ట్యాంక్ సిద్ధం...

పట్టణంలోని జాతీయరహదారికి కుడివైపు ఉన్న ప్రాంతానికి నీటి గోస తీర్చేందుకు రెండేళ్ల కిందటే హెచ్‌ఎండబ్ల్యూఎస్ 2 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన ఒవర్ హెడ్ ట్యాంకు హుడా కాలనీలో నిర్మాణం ప్రారంభించి పూర్తి చేసింది. ప్రస్తుతం ఈ ట్యాంకు నీటి సరఫరాకు పూర్తిగా సిద్ధమైన అధికారికంగా దానిని ప్రారంభించే ముహుర్త మాత్రం ఇంకా ప్రభుత్వం నిర్ణయించలేదు.

భారీ ఎత్తున అక్రమ కనెక్షన్లు..

హెచ్‌ఎండబ్ల్యూఎస్ కేవలం మూడు మిలియన్ల నీటిని మాత్రమే సరఫరా చేయడానికి కనెక్షన్ల లెక్కలకు అనుగుణంగా ఉంది. కానీ పట్టణంలో సుమారు మూడు నుంచి నాలు వేల వరకు అక్రమ నల్లా కనెక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. వీటిని క్రమబద్ధీకరించుకునేందుకు గృహ యజమానులు, వ్యాపారులు ముందుకు రావడం లేదు. అయినా అక్రమ కనెక్షన్లు భారీగా ఉండడంతో వీటికి కూడా సరఫరా జరుగుతుండడంతో రికార్డుల ప్రకారం బిల్లులు చెల్లించే వారికి సరైన నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారు. వీటిని తొలగించేందుకు, క్రమబద్ధీకరించేందుకు ఇప్పటి వరకు సరైన చర్యలు తీసుకోకపోవడం వెనక ఉన్న మతలబేమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

అధికారికంగా 7 వేల కనెక్షన్లు..

ఓఆర్‌ఆర్ లోపల ఉన్న పరిధిలోని పట్టణ ప్రాంత బస్తీలు, కొన్ని గ్రామాలకు కలిపి హైదరాబాద్ మెట్రోవాటర్ బోర్డు ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా జరుగుతోంది. హెచ్‌ఎండబ్ల్యూఎస్ రికార్డులో ప్రస్తుతం గృహ, వాణిజ్య నల్లా కనెక్షన్లు మొత్తం 7వేలు ఉన్నాయి. ఒక్కో నల్లా కనెక్షన్‌కు ప్రతి రోజు రికార్డు ప్రకారం 500లీటర్ల నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం పట్టణంలో ధర్మగిరి వద్ద ఉన్న రిజర్వాయర్ సామర్థ్యం 3వేల మిలియన్ లీటర్లు. దీంతో రోజు విడిచి రోజు హెచ్‌ఎండబ్ల్యూఎస్ 7వేల కనెక్షన్లకు నీటి సరఫరా చేస్తోంది. ప్రతి రోజు ఐదు వేల మిలియన్ లీటర్ల అవసరం ఉన్నప్పటి కేవలం మూడు వేల మిలియన్ లీటర్ల మాత్రమే సరఫరా అవుతున్నాయి.

అక్రమ కనెక్షన్లతోనే ఇబ్బందులు

పైప్‌లైన్‌లలో ఉన్న సమస్యల కారణంగా కొన్నిరోజుల నుంచి నీటి సరఫరాలో కొంత మేరకు ఇబ్బంది ఉంది. ప్రస్తుతం 3 మిలియన్ల పైచిలుకు లీటర్ల నీటి సరఫరా జరుగుతోంది. పట్టణానికి ప్రతిరోజు ఐదు మిలియన్ల లీటర్ల అవసరం ఉంది. ఇందులో అక్రమ కనెక్షన్లు ఉన్నాయి. రికార్డుల్లో కనెక్షన్ల సంఖ్య ఉన్న దాని ప్రకారమే నీటి సరఫరా జరుగుతోంది. అక్రమ కనెక్షన్లను క్రమబద్ధీకరించుకోవాలి. ప్లింత్ ఏరియా పెద్దగా ఉన్న వారు 1 ఇంచ్ నీటి కనెక్షన్లు తీసుకోవాలి. గతంలో మాదిరిగా బోరు నీటితో కలిసి నీటి సరఫరా జరగడం లేదు. దాదాపు కృష్ణా నీటి మాత్రమే సరఫా చేస్తున్నాం.

– హసీనా, హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజర్

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఉమారెడ్డి

రాజేంద్రనగర్: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాజేంద్రనగర్ మహిళా మండలి అధ్యక్షురాలు ఝాన్సీ ఉమారెడ్డి అన్నారు.సన్ రైస్ ఆసుపత్రి ఆధ్వర్యంలో రాజేంద్రనగర్‌లోని బాబా క్లినిక్ వద్ద నిర్వహించిన వైద్యశిబిరాన్ని ఆమె ఆదివారం ప్రారంభించారు. స్థానిక ప్రాంతాలకు చెందిన దాదాపు 300 మంది ఈ సందర్భంగా వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

కాలనీల అభివృద్ధికి కృషి చేస్తా

గోల్కొండ: కాలనీల అభివృద్ధికి కృషి చేస్తానని షేక్‌పేట్ కార్పొరేటర్ మహ్మద్ రాషేద్ ఫరాజుద్దీన్ అన్నారు. టోలిచౌకీ డిలక్స్ కాలనీ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై నూతనంగా ఎన్నికైన వారిని అభినందించారు. అధ్యక్షుడిగా కె.ఖ్యా. జునైది, ఉపాధ్యక్షులుగా ఎండీ ఉమర్ ఆలీ, మహ్మద్ హిదాయత్ ఆలీఖాన్, ప్రధాన కార్యదర్శిగా ఎండీ మునావర్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీలుగా గులామ్ హకీమ్, మసీఉద్దీన్ అన్సారీ, డాక్టర్ సయ్యద్ ఆలీ రజ్వీ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

20 నుంచి జర్నలిస్టుల క్రికెట్ లీగ్

గన్‌ఫౌండ్రీ: విధి నిర్వహణలో నిత్యం ఒత్తిడితో ఉండే జర్నలిస్టుల కోసం క్రీడా పోటీలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని బీసీసీఐ మాజీ చీఫ్ సెలక్టర్ ఎంఎస్‌కే.ప్రసాద్ అన్నారు. ఆదివారం ఎల్బీస్టేడియంలో కేఎస్‌జీ జర్నలిస్టు ప్రీమియర్ లీగ్ ట్రోఫీ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రొఫెషనల్ పద్ధతిలో జర్నలిస్టులు క్రికెట్ ఆడడంపై హర్షం వ్యక్తం చేశారు. ఏ క్రీడలోనైనా యువ ఆటగాళ్లను వెలుగులోకి తీసుకురావాలంటే క్రీడా జర్నలిస్టులతోనే సాధ్యమని వారి కష్టాన్ని గుర్తించి గౌరవించాలన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి మాట్లాడుతూ..ఈ క్రీడా పోటీలు క్రీడల ఆవశ్యకతను తెలియజేస్తాయని ఈ పోటీలకు ప్రభుత్వం తరపున పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. కేఎస్‌జీ సంస్థ చైర్మన్ అభిషేక్‌రెడ్డి మాట్లాడుతూ.. వివిధ మీడియా సంస్థలకు చెందిన పది జట్లు ఈ పోటీల్లో పాల్గొంటాయని, ఈ నెల 20 నుంచి 25వ తేదీ వరకు ఈ మ్యాచ్‌లు జరుగుతాయని వెల్లడించారు. ఈ సమావేశంలో తృక్ష ఫుడ్స్ ఎండీ భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లంగర్‌హౌజ్ ఊరేగింపులో ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో ఉదయ్‌కుమార్


కోటపై అమ్మవారి పూజల్లో చైర్మన్ కాంత అరవింద్, చంటిబాబు


బుజిలీ మహంకాళి ఆలయంలో పాతబస్తీ బోనాలకు పూజలు చేస్తున్న చైర్మన్ పరమేష్‌కుమార్

బోనం.. వైభవం

- భక్తిశ్రద్ధలతో కోటలో మూడో బోనం పూజలు
- ఆకట్టుకున్న శివసత్తులు, పోతరాజుల విన్యాసలు
- పోలీసుల భారీ బందోబస్తు

గోల్కొండ: గోల్కొండ అమ్మవార్ల మూడో బోనం పూజకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చారు. గోల్కొండ కోటతో పాటు కోట పరిసరాల్లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. కోటలో భక్తులతో నిండిన గోల్కొండ కోటలో ఒక అంగులం జాగా కూడా ఖాళీ లేకుండాపోయింది. ముందు జాగ్రత్తగా అధికారులు భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా చూశారు. కోట చోటా బజార్ నుంచి తొట్టెల ఊరేగింపులో శివసత్తులు, పోతరాజుల విన్యాసలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. తొట్టెల ఊరేగింపులకు స్థానికులు సైతం స్వాగతం పలికారు. మహిళా గంజ్, లంగర్‌హౌస్, చార్మినార్, చాంద్రాయణగుట్ట, కార్వాన్ సబ్జీ మండి తదితర ప్రాంతాల నుంచి ఆలయాల నిర్వాహకులు అందంగా అలంకరించిన తొట్టెలను గోల్కొండ అమ్మవారికి సమర్పించారు. ఈ ఊరేగింపులో యువకులు సాంప్రదాయ డప్పు వాయిద్యాలపై నృత్యాలు చేస్తూ అందరి దృష్టిని ఆకర్షించారు. మహంకాళి ఆలయ పూజారి పూజలు నిర్వహించారు. ఆలయ కార్యానిర్వహణ అధికారి ఈ.శ్రీనివాస్‌రాజు పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కోటలోని నగీనా బ్యారెక్స్‌లో సాంప్రదాయ దుస్తుల్లో మహిళలు బోనం కుండలను తయారు చేసుకొని అమ్మవారికి సమర్పించడానికి కోటపైకి వెళ్లారు. నగర అదనపు పోలీసు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు.

అందరికీ సుఖ సంతోషాలు కలుగాలి..

లంగర్‌హౌస్: అమ్మవారి ఆశీస్సులు అందరికీ కలిగి అందరు సుభిక్షంగా ఉండాలని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి అన్నారు. లంగర్‌హౌస్‌లో గోల్కొండ బోనాల సామూహిక తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన వివిధ స్వాగత వేదికల వద్దకు వెళ్లి బోనాలు, తొట్టెలకు పూజలు నిర్వహించారు. గో ల్కొండ జగదాంబిక బోనాల ఉత్సవ కమిటీ చైర్మన్ కాంత అరవింద్ ఆధ్వర్యంలో మార్కెట్ రోడ్డులో ఆయన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదిక వద్ద అతని తండ్రి కాంత నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో ప్రముఖులు పూజలు నిర్వహించారు. బుజిలీ మహంకాళి ఆలయంలో చైర్మ న్ బోగి పరమేష్‌కుమార్ ఆధ్వర్యంలో వివిధ జిల్లాల నుంచి వచ్చిన వారు పూజలు నిర్వహించి ఊరే గింపులు ప్రారంభించారు. లంగర్‌హౌస్ నుంచి గోల్కొండ వరకు ఇసుకేస్తే రాలనంత జనసందోహంతో ప్రధాన దారులు నిండాయి. డప్పు వాయిద్యాలు, పోతరాజుల విన్యాసాలు, డీజేలు, యువతీయువకుల నృత్యాలు, శివసత్తుల పూనకాలతో ఊరేగింపులు వైభవంగా సాగాయి. ఈ సామూహిక ఊరేగింపులో ఆలయ ఉత్సవ కమిటీ ఇన్‌చార్జి చంటిబాబు, మాజీ కార్పొరేటర్ ఉదయ్‌కుమార్, కాంత సచిన్ తదితరులు పాల్గొని పూజలు నిర్వహించారు.


మహిళా గంజ్‌లో పోతరాజుల విన్యాసాలు


మహంకాళి ఆలయం వద్ద భక్తులు

కాలనీ సమస్యలను పరిష్కరించుకుందాం


కమ్యూనిటీ హాల్‌లో సమావేశమైన కాలనీ వాసులు

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి యాదవమిత్ర కాలనీ, భారతీనగర్ కాలనీ అసోసియేషన్ సభ్యులు కమ్యూనిటీ హాల్లో ఆదివారం సమావేశం నిర్వహించారు. కాలనీలలో స్థానికంగా నెలకొన్న నీటి సమస్య, వీధిదీపాలు, కరెంటు అంతరాయం, రోడ్లపై మురుగు, దోమలు, వీధి కుక్కల బెడద తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. నీటి సమస్యపై జలమండలి మేనేజర్ శ్రీనివాస్‌తో వెల్లడించడంతో సరిపడా నీరు అందిస్తామన్నారని కాలనీ వాసులు తెలిపారు. తదితర సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ రాందాస్ ముదిరాజ్, నెహ్రూ, టి.సత్యంగౌడ్, శేఖర్‌బాబు యాదవ్, శేఖరయ్య, జీవన్‌రెడ్డి, విషువర్ధన్ తదితర కాలనీ వాసులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి శ్రీకారం


ఆలయానికి చేరుకున్న విగ్రహమూర్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి చైతన్య విలాస్ కాలనీలో శ్రీ సీతారామచంద్ర ఆలయంలో ఆగస్టు 9న విగ్రహప్రతిష్ఠాపన కార్యక్రమ నిర్వహణకు ఆలయ కమిటీ ప్రతినిధులు ఆదివారం శ్రీకారం చుట్టారు. భద్రచలం నుంచి విగ్రహమూర్తులను మంగళవాయిద్యాలతో ఆలయానికి తీసుకువచ్చారు. ఆలయ కమిటీ ప్రతినిధులు మురళి, మహేష్, రాజేష్‌ల ఆధ్వర్యంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి ఏర్పాట్లు చేశారు. కాలనీ వాసుల సమష్టి కృషితో ఆలయ నిర్మాణానికి పునాదులు వేశారు. విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

కార్మికుల కష్టాన్ని గుర్తించాలి


మున్సిపల్ కార్మికులను సన్మానించిన వైస్ చైర్మన్, కమిషనర్

మణికొండ: ప్రతినిత్యం మన కాలనీలు, వార్డులను పరిశుభ్రం చేయడంతో పాటు మురుగునీరు పోయేలా, వీధి దీపాలు వెలిగేలా అనుదినం కృషి చేస్తున్న మున్సిపల్ కార్మికుల కష్టాన్ని గుర్తించాలని మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, కమిషనర్ ప్రదీప్‌కుమార్ అన్నారు ఆదివారం. భారత్ వికాస్ పరిషత్ రాష్ట్ర ఎన్విరాన్‌మెంటల్ కన్వీనర్ రఘుసతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎంప్లాయీస్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో మున్సిపాలిటీలో పనిచేస్తున్న 270 మంది కార్మికులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో ఏబీసీఎస్‌పీ అధ్యక్షుడు రామానుజ, ఏబీసీబీసీ ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు, కౌన్సిలర్‌లు శ్రీకాంత్‌స్వామి, పి.శైలజ, కోఆప్షన్ సభ్యులు, బీజేపీ నాయకులు, కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ ప్రభావతిలతో పాటు కార్మికులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలు


బుద్వేల్ కోట మైసమ్మ దేవాలయం

రాజేంద్రనగర్: బుద్వేల్ కోట మైసమ్మ ఆలయంలో వారాహి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆదివారం సామూహిక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కోట మైసమ్మ తల్లి దేవాలయ ప్రధాన అర్చకులు సందీప్ శర్మ, వీరభద్ర స్వామి దేవాలయ ప్రధాన అర్చకులు వేద పండితులు రామక్రిష్ణ శర్మ ఆధ్వర్యంలో ఈ పూజా కార్యక్రమాలు కొనసాగాయి. స్థానిక ప్రాంతాలకు చెందిన వందలాది మంది భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆదివారం కావడంతో ఉదయం నుండి రాత్రి వరకు దేవాలయం భక్తులతో కిటకిటలాడింది.

యువకుడి అదృశ్యం



అత్తాపూర్: ఓ యువకుడు అదృశ్యమై సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. హనుమాన్ నగర్ ఎస్ఎంగూడకు చెందిన శ్రీనాథ్ ఈ నెల 13న ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

భర్త రెండో వివాహం చేసుకుంటున్నాడని పోలీసులకు ఫిర్యాదు

- ఫామ్ హౌస్‌కు వెళ్లిన పోలీసులు
- అక్కడ ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగిన వైనం

శంషాబాద్ రూరల్: తన భర్త రెండో వివాహం చేసుకుంటున్నాడని ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. వివాహం జరుగుతున్న చోటికి వెళ్లగా అక్కడ ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగిన సంఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. నగరంలోని లాల్‌దర్వాజకు చెందిన సిద్దార్థ్, కవిత దంపతులకు ఓ కుమార్తె ఉంది. వీరి మధ్య కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో న్యాయస్థానం వీరికి విడాకులు మంజూరు చేసింది. అయితే విడాకులు తీసుకోవడానికి ఇష్టం లేని కవిత హైకోర్టును ఆశ్రయించింది. ఈ క్రమంలో సిద్దార్థ్ రెండో పెళ్లి చేసుకుంటున్నట్లు తెలియడంతో ఆమె ఆదివారం శంషాబాద్ పోలీసులను ఆశ్రయించింది. నర్కూడ శివారులోని ఫాంహౌజ్‌లో పెళ్లి జరుగుతున్నట్లు చెప్పడంతో పోలీసులు కవిత, ఆమె బంధువులతో కలిసి అక్కడికి వెళ్లారు. తీరా అక్కడ ఎవరూ లేకపోవడంతో వెనుదిరిగారు.